# వాస్తు మహాత్మ్యం

"యేమే భవానీ, ఇంట్లోనే ఉన్నావా?" అన్న మాట వినిపించటంతో పూజగదిలో పూజ ముగించుకొని బయటకొస్తున్న భవానీదేవి తనకోసం ఎవరో వచ్చారని గ్రహించి వాళ్ళింటి డ్రాయింగ్ రూంలోకొచ్చింది.

భవానీ వాళ్ళ అన్నయ్య సత్యనారాయణ, మరో కొత్తవ్యక్తి డ్రాయింగ్‌రూంలోని సోఫాల మీద కూర్చొని ఉన్నారు.

"ఇదేనా రావడం అన్నయ్యా! వదిన, పిల్లలు బావున్నారా? ఒకే ఊర్లో ఉంటున్నామన్న మాటేగానీ కలుసుకోవటమే లేదు" అంది భవానీదేవి.

"ఈ మహానగరంలో ఒకచోటి నుండి ఇంకోచోటికి రావడమంటే ఎంత కష్టమో తెలియందా భవానీ! అందరం బాగానే ఉన్నాం... అది సరేగానీ, ఈయనెవరో తెలుసా భవానీ?" అన్నాడు సత్యనారాయణ తన పక్కనే కూర్చున్న ఆ కొత్తవ్యక్తిని చూపిస్తూ.

"నువ్వు చెప్పందే ఎలా తెలుస్తుందన్నయ్యా?" అంది భవానీ ఆ కొత్త వ్యక్తిని పరిశీలనగా చూస్తూ.

అతనిది ఎర్రటి భారీ విగ్రహం. పట్టువస్త్రాలు ధరించాడు. నొసటన ఊర్ధ్వపుండ్రాలు. చూడగానే ఈయనెవరో గొప్ప జ్యోతిష్య పండితుడు అన్న అభిప్రాయం కల్గుతుంది.

"లక్ష్మణమూర్తి గారని గొప్ప వాస్తు పండితుడు. మీరు కొత్తగా ఇల్లు కట్టుకున్నారు కదా! మీరీ ఇంట్లోకి మారినప్పట్నించీ మీకేదీ మంచి జరగటం లేదని నువ్వే ఒకసారి చెప్పావు. ఈ ఇంటికేదో వాస్తుదోషం ఉన్నట్టుందనీ, మీకు తెలిసిన వాస్తు పండితుడెవరైనా ఉంటే అతన్నొకసారి తీసుకొచ్చి మా ఇంటిని చూపించండని కూడా చెప్పావు. అందుకే వీరినిప్పుడు మీ ఇంటికి తీసుకొచ్చాను. ఈయన ఎంత గొప్ప వాస్తు పండితుడో మాటల్లో చెప్పలేను. పెద్ద పెద్ద కోటీశ్వరులు, పారిశ్రామికవేత్తలు, ముఖ్యమంత్రులు, క్యాబినెట్ మంత్రులు, సినిమా స్టార్లు లాంటి వాళ్ళెవరు నూతన నిర్మాణాలు చేపట్టినా ఈయననే సంప్రదిస్తారు. ఈయన చేసిన సూచనల్ని తు.చ. తప్పకుండా పాటిస్తారు" అన్నాడు సత్యనారాయణ.

"మంచిపని చేశారన్నయ్యా! మా ఇంట్లో పెళ్ళికెదిగిన ఆడపిల్లుంది. ఐదారేళ్ళ నుండి ఎన్నో సంబంధాలు చూశాం. యేదీ కుదరలేదు. అమెరికాకేమో మా అబ్బాయిని

పంపించాం, వాడికేదన్నా మంచి ఉద్యోగం దొరుకుతుందన్న ఆశతో. కానీ వాడికింకా వాడి క్వాలిఫికేషన్‌కు తగిన మంచి ఉద్యోగం దొరకలేదు. మంచి ఉద్యగమే దొరికిందని అందరికీ చెబుతున్నామనుకోండి. వాడికి కోటిదాకా కట్నమిచ్చి పిల్లనిస్తామని చాలామందే వస్తున్నారు. కానీ ఆడపిల్ల పెళ్ళి చెయ్యకుండా మగపిల్లాడి పెళ్ళి చెయ్యొద్దను కుంటున్నాము" అంది భవాని.

"మీ ఇంటిని చూడగానే నాకనిపించింది, చాలా వాస్తు దోషాలున్నాయని... వాస్తు దోషాలున్నప్పుడు మనం అనుకున్నదేదీ జరగదు..." అన్నాడు లక్ష్మణమూర్తి గంభీరంగా.

"మా ఇంటికి వాస్తుదోషాలున్నాయని మీరేకాదు... చాలామంది చెప్పారు" అంది భవానీ.

"చాలామంది చెప్పడం వేరు. లక్ష్మణమూర్తిగారు చెప్పడం వేరు. ఈయన మహాపండితుడు. ఈయన చెప్పే మాటకు తిరుగుండదు. లక్ష్మణమూర్తిగారూ! చెప్పండి... ఈ ఇంట్లో ఉన్న వాస్తుదోషాలేమిటో... వాటిని తొలగించటానికి యేయే మార్పులు చెయ్యాలో చెప్పండి" అన్నాడు సత్యనారాయణ.

"చెబుతాను... చెప్పటానికేగా వచ్చింది. ఒకసారి ఇల్లంతా తిరిగొద్దాం రండి" అన్నాడు లక్ష్మణమూర్తి.

"అలాగే" అంటూ సత్యనారాయణ లేచి నిల్చున్నాడు.

భవానీదేవి వాళ్ళిద్దరికీ నాలుగేళ్ళ క్రితమే రెండు కోట్లు ఖర్చుచేసి నిర్మించబడిన ఆ స్వప్నసౌధాన్ని వాళ్ళకు చూపించింది.

"ఈ ఇంట్లో యేదీ సరిగ్గా లేదు. కొన్ని మార్పులు తప్పనిసరిగా చేస్తే తప్ప మీకు శుభం కల్గదు" అన్నాడు లక్ష్మణమూర్తి ఇల్లంతా తిరిగొచ్చాక డ్రాయింగ్ రూంలో కూర్చుంటూ.

"ఎలాగైనా మీ ఆయన్ను ఒప్పించి లక్ష్మణమూర్తి గారు సూచించే మార్పుల్ని అమలు చేస్తానంటేనే ఆయన యేమేం మార్పులు చెయ్యాలో చెబుతారు" అన్నాడు సత్యనారాయణ.

"ఆయన్ను ఒప్పించే భారం నాది. మీరు మార్పుల గురించి చెప్పండి" అంది భవానీదేవి.

"ఇంట్లో వంటగది ఆగ్నేయంలో ఉండాలి. మీ ఇంట్లో అది ఈశాన్యంలో ఉంది. మీ బిల్డింగ్‌కు మెట్లు వాయువ్యంలో ఉన్నాయి. అది చాలా పెద్దదోషం. మీ

ఇంట్లో బోర్‌వెల్ నైరుతిలో ఉంది. అది ఈశాన్యంలో ఉండాలి. మీ ఇంటి ముఖ్యద్వారం పశ్చిమంలో ఉంది. దాన్ని తూర్పుకు గానీ, ఉత్తరానికిగానీ మార్చాలి. మీ ప్లాట్ పొజిషన్ చూస్తే తూర్పుకు మార్చే అవకాశం లేదు. కనీసం ఉత్తరానికి మార్చండి. మీ ఇంటి మెట్లను వాయవ్యం నుండి తీసేసి నైరుతికి మార్చండి. ఈ మార్పులన్నీ చేస్తే మీకు శుభం కల్గుతుంది. మీ ఆయనకు ప్రమోషన్ కూడా వస్తుంది" అన్నాడు లక్ష్మణమూర్తి.

"ఈ మార్పులన్నీ చేస్తే మా అమ్మాయికి వెంటనే పెళ్ళవుతుందా? మా అబ్బాయికి మంచి ఉద్యోగం దొరుకుతుందా?" అంది భవానీదేవి.

"తప్పకుండా... మీ అమ్మాయికి పెళ్ళవుతుంది. మీ అబ్బాయికి పెద్ద ఉద్యోగం దొరుకుతుంది.... మరచిపోయాను... మీ సెప్టిక్ ట్యాంకును కూడా మార్చాలి. అదిప్పుడు ఆగ్నేయంలో ఉంది. దాన్ని కూడిపించేసి వాయవ్యానికి మార్చండి" అన్నాడు లక్ష్మణమూర్తి.

"ఈ మార్పులు చేస్తే మీకు వెంటనే ప్రమోషన్ వస్తుందంటే మా ఆయన ఈ మార్పులకు వెంటనే అంగీకరిస్తాడు" నవ్వుతూ అంది భవానీదేవి.

"ఈ మార్పులన్నీ అమలు చెయ్యాలంటే ఓ పదిలక్షలన్నా అవుతుంది. మీవారు...." అంటూ ఆగిపోయాడు లక్ష్మణమూర్తి.

"మా చెల్లెలు ఒప్పిస్తుందిలెండి. మా బావగారు ఆర్ అండ్ బీలో ఏఈ... డబ్బుకు కొదవేమీ ఉండదులెండి. యే కాంట్రాక్టర్‌కో ఈ పని అప్పజెప్పేస్తే క్షణాల మీద అయిపోతుంది" అన్నాడు సత్యనారాయణ.

"నా బాధలేవో నేను పడ్తాను లెండి. ఈ ఇంటికున్న వాస్తు దోషాలవల్లనే మా అమ్మాయికి పెళ్ళికావడం లేదని నాకిప్పుడు రూఢయిపోయిందిలెండి" అంది భవానీదేవి.

తర్వాత భవానీదేవి వాళ్ళిద్దర్నీ వాళ్ళ డైనింగ్‌హాల్లోకి తీసికెళ్ళి వాళ్ళ వంటమనిషితో టిఫిన్లు వడ్డింపజేసి తర్వాత కాఫీలు కూడా అందించింది.

వాళ్ళు వెళ్ళిపోవడానికి సిద్ధమవుతుండగా

"మన లక్ష్మణమూర్తిగారి కన్సల్టేషన్ ఫీజు పదివేలు. ఇప్పుడిస్తావా... లేక బావగార్ని అడిగి తర్వాతిస్తావా?" అన్నాడు సత్యనారాయణ.

"మళ్ళీ తర్వాతెందుకు. ఇప్పుడే ఇస్తానుండండి" అంటూ భవానీదేవి వాళ్ళింటి లోపలిగదిలోకెళ్ళింది. పది వెయ్యి రూపాయల నోట్లతో తిరిగొచ్చి వాటిని ఓ హారతి పళ్ళెంలో పెట్టి లక్ష్మణమూర్తికిచ్చింది.

"ఇష్టకార్యసిద్ధిరస్తు" అని దీవించి, నోట్ల కట్టను జేబులో పెట్టుకొని "వెళ్ళొస్తానమ్మా... శుభం భూయాత్!" అని చెప్పి లక్ష్మణమూర్తి సత్యనారాయణతో కలిసి బయటకు వెళ్ళాడు. సత్యనారాయణ కూడా హైదరాబాద్‌లోనే ఆయన కొడుకు దగ్గర ఉంటాడు. ఆయన భవానీదేవికి పెద్దనాన్న కొడుకు. అయినా వాళ్ళు స్వంత అన్నా, చెల్లెళ్ళలాగే ఉంటారు.

లక్ష్మణమూర్తికి సత్యనారాయణకు మధ్య చాలా కాలంగా స్నేహం ఉంది. తనకు తెలిసిన చాలామంది ఇళ్ళకు లక్ష్మణమూర్తిని తీసుకెళ్తుంటాడు. ప్రతి ఇంట్లోనూ యేదో ఒక వాస్తుదోషం ఉన్నట్టు లక్ష్మణమూర్తి కనిపెట్టేస్తాడు. యేయే మార్పులు చేస్తే ఆ ఇంటి యజమానుల సమస్యలు పరిష్కారమౌతాయో చెప్పేస్తాడు. అలా లక్ష్మణమూర్తికి లభించే ఫీజులో కొంత పర్సంటేజి సత్యనారాయణకు కూడా అందుతుంది. ఇలా వాళ్ళిద్దరు కలిసి కొత్తగా నిర్మించబడిన ఇళ్ళళ్ళో ఎన్నో మార్పుల్ని, చేర్పుల్ని చేయించి చాలా పుణ్యం, పురుషార్థం మూటగట్టుకుంటున్నారని వాళ్ళను గమనిస్తున్న వాళ్ళు చెప్పుకుంటుంటారు.

భవానీదేవి భర్తపేరు వామన్‌రావు. అతనికి వాస్తు మీద పెద్ద నమ్మకం లేదు. "లక్ష్మణమూర్తి సూచించిన మార్పుల్ని అమలు చెయ్యాలంటే పదిలక్షలు సరిపోవు... ఇరవై లక్షలు కావాలి. అంత డబ్బు నా దగ్గరలేదు. ఈ మార్పులకు నేను అంగీకరించను" అని వామన్‌రావు భవానీదేవికి కరాఖండిగా చెప్పేశాడు. అయితే భవానీదేవికి తన భర్తను ఎలా ఒప్పించాలో తెలుసు.

ఆ మార్పులు చెయ్యకపోతే చచ్చిపోతానంది. "చచ్చిపో. నేను ఇంకోదాన్ని చూసుకొని చేసుకుంటా"నన్నాడు. ఆమె భోరుమని యేడ్చి అలకపాన్పు ఎక్కింది. నిరాహారదీక్ష ప్రారంభించింది. వారం రోజుల వరకు ఆమె అలకపాన్పు దిగలేదు. నిరాహారదీక్ష మానలేదు. వారం రోజుల తర్వాత ఆమెనోసారి చూసిన వామన్‌రావుకు ఆమె నిజంగానే చనిపోతుందేమోనన్న అనుమానం కల్గింది. దాంతో తనింట్లో లక్ష్మణమూర్తి సూచించిన వాస్తు మార్పుల్ని చేయించటానికి వామనమూర్తి అంగీకరించి భార్యచేత నిమ్మరసం తాగించి ఆమె నిరాహారదీక్షను విరమింపజేశాడు.

ఎంతో అందంగా కట్టుకున్న ఇంట్లోని కొన్ని భాగాల్ని కూలగొట్టటం అంటే ఎవరికైనా బాధ కల్గుతుంది. వామనమూర్తి ఎంతో అందంగా కట్టుకున్న తనింటి మెట్లనూ, వంటగదిని కూలగొడ్తోంటే, బోర్‌వెల్‌ను మూయిస్తోంటే, ముఖ్యద్వాజాను మారుస్తోంటే కళ్ళనీళ్ళ పర్యంతమయింది.

ఆరునెలల కాలం, ఇరవైలక్షల రూపాయలు ఖర్చయ్యాక వాస్తు పండితుడు లక్ష్మణమూర్తి సూచించిన మార్పులన్నీ అమలయ్యాయి.

భవానీదేవి చాలా సంతోషించింది.

త్వరలోనే తన కూతురు మౌనికకు ఓ సంబంధం కుదురుతుందని ఎదురు చూడసాగింది.

ఆమె ఎదురు చూపులు ఫలించాయి.

ఒకరోజు సత్యనారాయణరావే వాళ్ళింటికొచ్చి

"మన మౌనికొక మంచి సంబంధం తీసుకొచ్చాను భవానీ!" అన్నాడు.

"నిజమా అన్నయ్యా! ఈ సంబంధమైనా కుదురుతుందంటావా?" అంది భవానీదేవి.

"తప్పకుండా కుదురుతుంది. మీ ఇంటికున్న వాస్తుదోషాలన్నీ తొలగిపోయాయి కదా!" అన్నాడు సత్యనారాయణ.

"నిజమే అన్నయ్యా! మా ఇంట్లో లక్ష్మణమూర్తి గారు సూచించిన మార్పులన్నీ చేశాక మాకన్నీ శుభాలే జరుగుతున్నాయి. మీ బావగార్కి మొన్ననే ఈఈగా ప్రమోషనొచ్చింది. అమెరికాలో ఉంటున్న మా మాధవ్‌కు చాలా మంచి ఉద్యోగం దొరికింది. ఇప్పుడు మౌనికకు మీరు తెచ్చిన సంబంధం కూడా కుదిరిందంటే ఇదంతా లక్ష్మణమూర్తి చలవే అనుకుంటాం" అంది భవానీ.

"ఈ సంబంధం తప్పకుండా కుదురుతుందమ్మా! వాళ్ళంతట వాళ్ళే మనతో వియ్యమందాలని ఉవ్విళ్ళూరుతున్నారు. మన గురించి వాళ్ళు మొన్ననే ఇంటర్నెట్‌లో చూసి తెలుసుకున్నారట... మౌనికను గురించిన వివరాలన్నీ మీరు ఇంటర్నెట్‌లో పెట్టారట కదా!"

"ఔనన్నయ్యా! ఇంతకూ ఆ అబ్బాయి యేం చదివాడు. యేం ఉద్యోగం చేస్తున్నాడు? వాళ్ళదేవూరు... వాళ్ళ తల్లిదండ్రు లెవరూ? ఆ వివరాలన్నీ తెలుసుకున్నావా?"

"తెలుసుకున్నానమ్మా! తెలుసుకున్నాను. ఆ అబ్బాయి పేరు వినోద్... కాలిఫోర్నియాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. అతని జీతం మన కరెన్సీలో నెలకు పదిలక్షలు. వాళ్ళ అమ్మానాన్నలు ఇక్కడే హైదరాబాద్‌లో ఉంటూ అమెరికాకు వెళ్ళొస్తుంటారు. ఆ అబ్బాయి వాళ్ళ నాన్న హైస్కూలు హెడ్మాస్టర్‌గా రిటైరయ్యాడు. కొడుకును కష్టపడి చదివించి ఇంజినీర్‌ను చేశాడు. ఆయనకు ఒక కొడుకు... ఒక

కూతురు. కూతురు పెళ్ళయిపోయింది. అల్లుడూ, కూతురు కూడా అమెరికాలోనే ఉంటున్నారు. వాళ్ళ దగ్గర చాలామంది పెళ్ళికూతుళ్ళ వివరాలున్నాయి. కానీ వాళ్ళు మనకే ఫస్ట్ ప్రిఫరెన్స్ ఇస్తున్నారు. ఆ అబ్బాయి మొన్ననే అమెరికా నుండి పెళ్ళి చేసుకొని వెళ్ళాలని హైదరాబాద్ వచ్చాడు. హీ ఈజ్ ఇన్ ఎ హర్రీ... మనం రమ్మంటే వాళ్ళు రేపే మనింటికొచ్చి మౌనికను చూస్తారు" అన్నాడు సత్యనారాయణ.

చాలా బావుందన్నయ్యా! మీ బావగారు కాస్సేపట్లో లంచ్ కొస్తారు. ఆయనకీ వివరాలన్నీ చెప్పి రేపే వాళ్ళను మనింటికి పెళ్ళి చూపులకు రమ్మని చెబుదాం" అంది భవానీ.

వాళ్ళలా మాట్లాడుకుంటుండగానే వాళ్ళింటి ముందు కారాగిన చప్పుడైంది.

వామన్‌రావు కారు దిగి ఇంట్లోకొస్తూ డ్రాయింగ్ రూంలో కూర్చున్న సత్యనారాయణను చూశాడు.

"నమస్కారం బావగారూ!" అన్నాడు సత్యనారాయణ.

"నమస్కారం... మీరు మళ్ళీ వచ్చారంటే ఈ ఇంటికేదో మూడిందన్నమాటే!" అన్నాడు వామన్‌రావు.

"ఎంత మాటెంతమాట! మీ ఇంటి క్షేమం కోరేవాళ్ళల్లో నేనే మొదటి వ్యక్తిని బావగారు" అన్నాడు సత్యనారాయణ.

"ఔనౌను... అందుకే మొన్న మా ఇంటినంతా కుళ్ళపొడిపించారు" అన్నాడు వామన్‌రావు.

"వాస్తు దోషాలున్నప్పుడు తప్పదు కదా బావగారూ! ఈ ఇంటికున్న వాస్తుదోషం తొలగబట్టే కదా మీకు ఈఈగా ప్రమోషనొచ్చింది. స్టేట్స్‌లో మన మాధవ్‌కు మంచి ఉద్యోగం దొరికింది" అన్నాడు సత్యనారాయణ.

"నాకీ ప్రమోషన్ ఎప్పుడో రావాల్సింది. యేవో టెక్నికల్ ప్రాబ్లెమ్స్ ఉండి, అవన్నీ క్లియరైపోయాక ఇప్పుడొచ్చింది. నా ప్రమోషన్‌కూ, ఈ ఇంటి వాస్తుకూ ఎలాంటి సంబంధం లేదు" అన్నాడు వామన్‌రావు.

"మీరలాగే అంటారు బావగారు... మీ ఇంట్లో త్వరలోనే మరో శుభకార్యం జరగబోతున్నది" అన్నాడు సత్యనారాయణ.

"శుభకార్యమా? యేమిటది?" అన్నాడు వామన్‌రావు చాలా ఆశ్చర్యంగా.

"మా అన్నయ్య మన మౌనికొకక మంచి సంబంధం తీసుకొచ్చాడండీ! ఆ వివరాలన్నీ చెప్పు అన్నయ్యా!" అంది భవాని.

ఆ వివరాలన్నీ సత్యనారాయణ చెప్పాడు.

అతడు చెప్పందంతా విన్నాక

"చాలా బావుందే... మౌనికకు ఎన్నో సంబంధాలు చూశాం. కుదిరినట్టే కుదిరి యేదో కారణం చేత తప్పిపోయాయి. మౌనికకేం తక్కువ లేదు. అందం, చదువు అన్నీ ఉన్నాయి... కాకపోతే కొంచెం నలుపు. ఆ ఒక్క కారణం చేత ఐదారేళ్ళ నుండి ఎన్ని సంబంధాలు చూసినా యేదీ క్లిక్ కాలేదు. ఒకవేళ మీరిప్పుడు చెప్పిన సంబంధం కుదిరితే అది వాస్తు మహత్యమేనని ఒప్పుకుంటాను బావగారూ" అన్నాడు వామన్‌రావు.

"ఈ సంబంధం తప్పకుండా కుదురుతుంది బావగారూ! వాళ్ళను రేపే రమ్మంటాను. రేపు చాలా మంచిరోజు కూడా" అన్నాడు సత్యనారాయణ.

"అమ్మాయి కొంచెం నలుపని వాళ్ళకు ముందే చెబితే బావుంటుందేమో!" అన్నాడు వామన్‌రావు.

"వాళ్ళకన్నీ తెలుసు బావగారు... మీరేం సందేహించకండి. ఈ సంబంధం తప్పకుండా కుదురుతుంది. మన సంబంధం కుదరాలని వాళ్ళూ ఎంతో ఆశపడుతున్నారు..." అన్నాడు సత్యనారాయణ.

"అయితే వాళ్ళను రేపే రమ్మనండి" అన్నాడు వామన్‌రావు.

వామన్‌రావుతో బాటు సత్యనారాయణ కూడా భోజనం చేశాక "రేపు వాళ్ళను ఉదయం పదిన్నర వరకు తీసుకొస్తా"నని చెప్పి సత్యనారాయణ వెళ్ళిపోయాడు.

* * * *

మౌనికకు ఆ సంబంధం కుదిరింది.

15 రోజుల్లోనే మౌనికకు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మహేష్‌కు చాలా వైభవంగా పెళ్ళి జరిగింది. వామన్‌రావు 50 లక్షల కట్నమిచ్చి మరో 20 లక్షలు ఖర్చుచేసి ఆ పెళ్ళి జరిపించాడు.

పెళ్ళయిన రెండు నెలల తర్వాత మహేష్ మౌనికను తీసుకొని అమెరికాకు వెళ్ళిపోయాడు.

"ఇదంతా వాస్తు మహత్యమేన"ని వామన్‌రావు బంధువులూ, స్నేహితులు లక్ష్మణమూర్తిని వేనోళ్ళ పొగిడారు.

మరో ఆరునెలలు గడిచాక ఆ కుటుంబంలో ఎవరూ ఊహించని కొన్ని సంఘటనలు జరిగాయి.

అతనితో ఇంకొక్క క్షణం కూడా కాపురం చెయ్యలే"నని, "నాకు వెంటనే అతనితో విడాకులిప్పించండ"ని మౌనిక అమెరికా నుండి హైదరాబాద్ వచ్చేసింది. మహేష్ అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచెయ్యటం లేదట. అతనికసలు ఇంజినీరింగ్ డిగ్రీయే లేదుట. యేదో బ్యాంక్‌లో చిన్న ఉద్యోగం – ఇక్కడ అటెండర్‌తో సమానమైంది – చేస్తున్నాడట. "మీ నాన్ననడిగి ఓ కోటి రూపాయలు పట్టుకురా... ఇక్కడే యేదైనా వ్యాపారం చేద్దాం" అంటూ మౌనికను అనుక్షణం వేధిస్తుండేవాడుట.

ఓ కాంట్రాక్టర్ దగ్గర్నుంచి లక్షరూపాయల లంచం తీసుకుంటూ వామన్‌రావు ఏసీబీ వాళ్లకు దొరికిపోయాడు. అతన్ని వెంటనే ఉద్యోగంలోంచి తీసేశారు.

తల్లిదండ్రులకు చెప్పాపెట్టకుండా అమెరికాలో ఉంటున్న భవానీ, వామన్‌రావుల కొడుకు మాధవ్ ఓ తెల్లమ్మాయిని ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడని తెలిసినప్పుడు భవానీ, వామన్‌రావులు షాకైపోయారు. కోటిరూపాయల కట్నం తీసుకొని మాధవ్ పెళ్ళిని గ్రాండ్‌గా చెయ్యాలని కలలు గంటున్న వాళ్ళ కలలన్నీ కల్లలైపోవడంతో, చాలాకాలం వరకు వాళ్ళు షాక్ నుండి కోలుకోలేకపోయారు.

ఇదంతా వాస్తు మహత్మ్యమేనా?" అని వామన్‌రావు బంధువులు కొందరు వెళ్ళి లక్ష్మణమూర్తిని అడిగారు.

"యేది ఎప్పుడు ఎలా జరగాలని విధి నిర్ణయించిందో అది అప్పుడు అలా జరుగుతుంది. మనమంతా నిమిత్తమాత్రులం" అన్నాడు లక్ష్మణమూర్తి.

"ఇదేమాట ముందే చెప్పొచ్చుకదా?" అని అడిగితే "యేది ఎప్పుడు ఎలా చెప్పబడాలని విధి నిర్ణయిస్తుందో అది అప్పుడు అలా చెప్పబడుతుంది" అన్నాడు లక్ష్మణమూర్తి.

✧✧✧✧✧

– 'చిత్ర' (మాసపత్రిక)